క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు మూడు రోజులు అంతరాయం

సింహాచలం: అడవివరం పాతగోశాల నుంచి బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ పనుల చేపడుతున్న కారణంగా ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. గోశాల జంక్షన్, టీవీటవర్‌కాలనీ, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా, సింహాచలం తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

స్పాట్ అడ్మిషన్లకు నేటితో గడువు పూర్తి

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్‌కు గురువారం తో గడువు ముగుస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమకు సంబంధించిన ధ్రువ పత్రాలతో నేరుగా కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం


తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు శ్రావణ్, శ్రీకాంత్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాలక మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు


వాడచీపురుపల్లిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు

పరవాడ: బాల్య వివాహ రహిత భారత దేశ నిర్మాణమే ధ్యేయంగా ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని సీడ్ స్వచ్ఛంద సంస్థ పిలుపునిచ్చింది. మండలంలోని వాడచీపురుపల్లి, తానాం, పరవాడ గ్రామాల్లో బుధవారం ఆ సంస్థ సభ్యులు బాల్య వివాహాల వల్ల అనర్థాలపై అవగాహన కల్పించారు. 2030 నాటికల్లా దేశంలో బాల్య వివాహాలను నియంత్రిస్తామని పెద్దలు, పిల్లలు, గ్రామ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.

విద్యార్థుల సమస్యలకు సత్వర పరిష్కారం


సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

ఏయూ క్యాంపస్: విద్యార్థుల సమస్యలకు సత్వర పరిష్కారం చూపే విధంగా యంత్రాంగం పనిచేస్తోందని ఏయూ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఎస్.విజయ్‌మోహన్ సూచించారు. బుధవారం ఏయూ క్రీడా విభాగంలో విద్యార్థుల ఫిర్యాదుల స్వీకరణ కమిటీ సమావేశం నిర్వహించారు. వర్సిటీలో నూతన విద్య సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో కొత్తగా వర్సిటీలో చేరిన విద్యార్థుల నుంచి వచ్చే సమస్యలు, ఫిర్యాదులను సానుకూలంగా స్వీకరించి, పరిష్కరించాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు. విభాగంలో, హాస్టల్స్‌లో ఇబ్బందులు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి విద్యార్థులకు అత్యంత ప్రాధాన్యమిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నారన్నారు. కమిటీ సభ్యులు నిరంతరం పర్యవేక్షిస్తూ విద్యార్థులకు సమస్యలు లేకుండా పనిచేయాలని చైర్మన్ ఆచార్య విజయ్ మోహన్ సూచించారు. కార్యక్రమంలో ఆచార్య పి.వెంకటేశ్వర్లు, ఆచార్య ఎ.కె.ఎం.పవార్, ఆచార్య కె.రమా సుధ, ఆచార్య టి.వి.కృష్ణ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- జగనన్నకు చెబుదాంకు విశేష స్పందన
- జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున
- 79 వినతుల స్వీకరణ


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

సింహాచలం: జగనన్నకు చెబుదాం వేదికగా ప్రజల నుంచి వస్తున్న వినతులపై సకాలంలో స్పందిండం , సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే అంతిమ లక్ష్యంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. పెందుర్తి మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం పెందుర్తిలోని జిల్లా సమాఖ్య భవనంలో బుధవారం జరిగింది. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రెవెన్యూ విభాగానికి సంబంధించి రీ సర్వే, భూ సరిహద్దులు, విస్తీర్ణం విభేదాలు, ఆక్రమణలతో పాటు జీవీఎంసీ పరిధిలోని మౌలిక వసతుల కల్పన, మురుగు కాలువల తవ్వకం, ఇంటింటి కుళాయిలు ఏర్పాట్లు, వీధి లైట్ల ఏర్పాటు తదితర సమస్యలకు సంబంధించి మొత్తం 79 మంది అర్జీదారులు వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు ఒకటికి రెండు సార్లు పరిశీలించి, శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమస్య రీ ఓపెన్ కాకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఒకే సమస్య రెండు మూడు శాఖలకు సంబంధించి ఉంటే అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. అవసరమైతే సమస్యను పరిష్కరించేందుకు సంయుక్తంగా క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని ఆదేశించారు. సానుకూల ధోరణితో వ్యవహరించి ప్రజలు సంతృప్తి చెందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్యాటరీ సహకారంతో నడిచే ట్రై సైకిల్ కావాలని కోరుతూ అర్జీలు తీసుకొచ్చిన వికలాంగుల వద్దకు కలెక్టరే స్వయంగా వచ్చి వెళ్లి వినతులు స్వీకరించారు. సానుకూలంగా స్పందించిన ఆయన విద్యుత్ వాహనం సమకూర్చేందుకు చర్యలు తీసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమశాఖ ఏడీని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్, పెందుర్తి తహసీల్దార్ శ్యామ్, డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, ఎంపీపీ మధుపాడ నాగమణి, ఎంపీడీవో వసంత, నార్త్ ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమైన అర్జీలు ఇవీ

- పెందుర్తిలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి మండల పరిషత్‌కు రావాల్సిన రూ.7 కోట్లు విడుదల చేయాలని, పెందుర్తి పోలీస్ స్టేషన్‌ను రెండు భాగాలు చేసి వేరే చోట మరో పోలీస్ స్టేషన్‌తో పాటు పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని ఎంపీపీ మధుపాడ నాగమణి, గొరపల్లి సర్పంచ్ గొరపల్లి శ్రీను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.కాగా మండల పరిషత్‌కు రూ. కోటి మంజూరు చేసినట్టు కలెక్టర్ మల్లికార్జున తెలిపారు.
- జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్‌లో శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని, రైతుబజార్ ఏర్పాటుకు పదేళ్ల కిందట అనుమతులు వచ్చినా ఇంత వరకూ కార్యరూపం దాల్చలేదని సుజాతనగర్ బీహెచ్‌పీవీ కాలనీ సెక్రటరీ డీఎస్.మూర్తి తీసుకెళ్లారు. అలాగే కమిటీహాలు నిర్మించాలని కోరారు.
- మండలంలోని సౌభాగ్యరాయపురంలో కల్వర్టు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిందని.. దానిస్థానంలో నూతన బ్రిడ్జి నిర్మించాలని ఎస్ఆపురం సర్పంచ్ దూది విజయలక్ష్మి కోరారు.
- పంచగ్రామాల సమస్యతో ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నామని 95వ వార్డు పరిధి చీమలాపల్లికి చెందిన సత్యమూర్తి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.
- చింతగట్లలో తనకు చెందిన 11 సెంట్లు భూమి రీసర్వే పుస్తకాల్లో నమోదు కాలేదని దేవుడు అనే వ్యక్తి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.


విభిన్నప్రతిభావంతుల దగ్గరకు స్వయంగా వెళ్ల సమస్య వింటున్న కలెక్టర్ మల్లికార్జున


అర్జీలు నమోదు చేస్తున్న సచివాలయి, కలెక్టరేట్ సిబ్బంది


హాజరైన వివిధ శాఖల అధికారులు

సంక్షేమ సారథి సీఎం జగన్


మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

పరవాడ: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. రావాడ శివారు బొట్టవానిపాలెం, మోటూరువానిపాలెం, ఎన్టీఆర్ కాలనీ, శృంగారపాడు, జల్లెలపాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మురుగు కాలువలు, సీసీ రోడ్లు నిర్మించాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అవసరమైన ప్రదేశాల్లో కాలువలు, సీసీ రోడ్లు నిర్మించడానికి చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అనంతరం ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడు సంక్షేమ పథకాలు అందించి పేద, బడుగు, బలహీన వర్గాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భరోసాగా నిలిచారన్నారు. వితంతు, వికలాంగ పింఛన్లు, మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రోత్సాహం, రైతు భరోసా, పిల్లలకు నాణ్యమైన విద్య, పేదలందరికి సొంతిళ్లు, డ్వాక్రా రుణాలు ఇలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి చరిత్ర సృష్టించారన్నారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలతో తమ కుటుంబాల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, ఈవోఆర్డీ రమేష్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కావలి రాజు, అప్పలరాజు, వాసు, పల్లా గోవిందు, ఏఈలు గండి రామారావు, షణ్ముఖ, శేషసాయి, రెడ్డి, ఎంఈవో శైలజ, వీఆర్వో భుజంగరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మంగళకారిణి.. సౌభాగ్య ప్రదాయిని


విజినిగిరిపాలెంలో గాయత్రీదేవిగా ఉమాదేవి


శారదాపీఠంలో అన్నపూర్ణగా రాజశ్యామల అమ్మవారు


నాయుడుతోటలో ధనలక్ష్మిగా గాయత్రీదేవి

- విభిన్న రూపాల్లో దుర్గమ్మ
- భక్తిశ్రద్ధలతో పూజలు

సింహాచలం: శరన్నవరాత్రి మహోత్సవాల వేళ అమ్మవారి ఆలయాలు దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాయి. ప్రత్యేక అలంకరణల్లో అమ్మవారు దర్శనమిస్తున్నారు. ప్రతి రోజూ విశేష పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులు అమ్మవార్లను భక్తితో కొలుస్తున్నారు.

- అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ఉమాదేవి బుధవారం గాయత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవారికి పసుపుకుంకుమలు సమర్పించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.
- చినముషిడివాడలోని విశాఖ శ్రీ శారదాపీఠంలో రాజశ్యామల అమ్మవారు నాలుగో రోజు బుధవారం అన్నపూర్ణగా దర్శనమిచ్చారు. అమ్మవారికి పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి హారతులు అందజేశారు. పీఠంలో రాజశ్యామల యాగం కొనసాగింది. శ్రీచక్రానికి నవావరణార్చన నిర్వహించారు. అందరికీ భోగభాగ్యాలు సిద్ధించాలని ఆకాంక్షిస్తూ శ్రీమత్ దేవీ భాగవత పారాయణ చేశారు. సాయంత్రం జరిగిన సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.
- జీవీఎంసీ 94వవార్డు నాయుడుతోటలోని వేద గాయత్రీదేవి ఆలయంలో బుధవారం గాయత్రీదేవి ధనలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని భక్తులు విశేషంగా తరలివచ్చి దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త రాపర్తి కన్నా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ లక్ష్యం

ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్న ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. తానాం గ్రామంలోని సామాజిక భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక వైద్య నిపుణుల పర్యవేక్షణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందన్నారు. రూపాయి ఖర్చు లేకుండా ప్రజలు వైద్య సేవలు పొందుతున్నారన్నారు. అనారోగ్య సమస్యలు ఉన్న వారు వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పి.ఎస్.రాజు, వైస్ పెందుర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పైల అప్పలనాయుడు, పార్టీ నాయకులు కావలి రాజు, బత్తిన అప్పారావు, గొరుపూటి శ్రీను, అప్పారావు, అశోక్ పాల్గొన్నారు.


తానాంలో మందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ప్రజల చెంతకే వైద్యం

సబ్బవరం: ప్రజల చెంతకే అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు.మండలంలోని ఆదిరెడ్డిపాలెంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆకాంక్షకు అనుగుణంగా కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. సుమారు 456 మందికి పరీక్షలు చేసిన వైద్యులు ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో 16 మందిని ఉన్నత వైద్యం కోసం ఆరోగ్యశ్రీకి సిఫార్సు చేశారు. 136 మందికి కంటి పరీక్షలు చేయగా 90 మందికి కంటి సమస్యలు గుర్తించి కళ్లజోళ్లు అందజేసినట్లు సబ్బవరం పీహెచ్‌సీ డాక్టర్ చక్రవర్తి తెలిపారు. కార్యక్రమంలో జగనన్న ఆరోగ్య సురక్ష నియోజకవర్గ ఇన్‌చార్జి కొటాన రాము,మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు,ఎంపీడీవో రమేష్ నాయుడు,తహసీల్దార్ సత్యనారాయణ,ఎంపీటీసీ బైలపూడి దేముడు బాబు,వైఎస్సార్‌సీపీ నాయకులు సబ్బవరపు నారాయణమూర్తి, యడ్ల నాయుడు,ఐడీ బాబు, గొంప దేముడు, కొటాన కోటయ్య, పల్ల కృష్ణ,ఎం సూర్యనారాయణ,డాక్టర్లు చక్రవర్తి, వెంకట రమణ,శరత్ తదితరులు పాల్గొన్నారు.


కంటి వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి తదితరులు

చెడుపై సాధించిన విజయమే విజయదశమి

సింహాచలం: విజయదశమి ఎంతో మహోన్నతమైనదని 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. 95వవార్డు చీమలాపల్లిలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చినముషిడివాడకు చెందిన బ్రహ్మకుమారీల చైతన్య దేవీల అలంకరణ, విజయదశమి ఆధ్యాత్మిక రహస్యం భక్తి ప్రవచనాలు నిర్వహించారు.కార్యక్రమాల్లో పాల్గొన్న ముమ్మన మాట్లాడుతూ వాడవాడలా విజయదశమి నవరాత్రులు ఎంతో వైభంగా జరుగుతాయన్నారు. చెడుపై మంచి విజయమే విజయదశమి పండగ సారాంశమన్నారు. కార్యక్రమంలో చినముషిడివాడ బ్రహ్మకుమారీస్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎ.ఎర్రయ్య, దువ్వి అప్పారావు, కె.సంతోష్, బొట్టగోవింద్, బొట్టా నూక అప్పలరాజు, కె.రామకృష్ణ, పరదేశి నాయుడు పాల్గొన్నారు.


ముమ్మనదేముడును సత్కరిస్తున్న బ్రహ్మకుమారీస్

సురేష్‌బాబుకు అభినందన


సురేష్‌బాబును సత్కరిస్తున్న యూనియన్ ప్రతినిధులు

పరవాడ: ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన ఎన్నికల్లో ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఈఎఫ్ఐ) చైర్మన్‌గా ఎన్నికైన వై.సురేష్ బాబును బుధవారం ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్ నాయకులు ఘనంగా సత్కరించారు. చైర్మన్ హోదాలో ఎన్టీపీసీని సందర్శించిన సురేష్ బాబును సన్మానించి మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని యూనియన్ అధ్యక్షుడు ఎం.జె.పి లెనిన్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.భీమరాజు, ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ అధ్యక్షుడు సెంథిల్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మూక్ కోర్సులు విద్యార్థులకు ఉపయుక్తం

ఏయూక్యాంపస్: మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సులు (మూక్స్) విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తున్నాయని ఢిల్లీలోని ఎస్‌జీటీబీ ఖల్సా కళాశాల రసాయనశాస్త్ర ఆచార్యురాలు విమల్ రాహ్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విభాగాన్ని బుధవారం సందర్శించిన ఆమె విద్యార్థులనుద్దేశించి ప్రత్యేకంగా ప్రసంగించారు. అనంతరం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వర్సిటీలో అందిస్తున్న కోర్సులు, స్టార్టప్, ఇంక్యుబేషన్ తదితర అంశాలను వీసీ వివరించారు. ఆచార్య విమల్ రాహ్ మాట్లాడుతూ ఈ లెర్నింగ్ విద్యార్థులకు సులభతరంగా నిలుస్తోందన్నారు. విద్యార్థులు అభ్యసిస్తున్న కోర్సుతో పాటు విభిన్న శాస్త్ర అంశాలను నేర్చుకోవడానికి, నూతన జ్ఞానాన్ని పొందడానికి ఇవి ఉపయుక్తంగా నిలుస్తున్న విధానాన్ని వివరించారు. యూజీసీ నిర్వహించిన ఒక ప్రాజెక్టులో భాగంగా తాను ఇ-కంటెంట్‌ని రూపకల్పన చేసి ఇచ్చిన విధానం తెలియజేశారు. దేశవ్యాప్తంగా ఉన్న నిపుణులైన ఆచార్యుల సహకారంతో విభిన్న శాస్త్ర అంశాల్లో ఈ-కంటెంట్‌ను అభివృద్ధి చేసి అందిస్తే విద్యార్థులకు ఎంతో ఉపయోగపడగలదన్నారు. ఉన్నత మానవ వనరులు, మౌలిక వసతులు కలిగిన ఏయూ ఈ దిశగా ముందడుగు వేయాలని సూచించారు. కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగాధిపతి ఆచార్య పి.శ్యామల, స్వయం నోడల్ అధికారిణి ఆచార్య కె.రమాసుధ, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.


ఆచార్య విమల్ రాహ్‌ను సత్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి తదితరులు

లారీ డ్రైవర్ ఆత్మహత్య

సబ్బవరం: మండలంలోని ఆదిరెడ్డిపాలెం పెట్రోల్ బంకు సమీపంలో ఆనందపురం-అనకాపల్లి జాతీయ రహదారి ఫ్లై ఓవర్ కిందట లారీ డ్రైవర్ ఉరిపోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక ఎస్ఐ ఎల్. సురేష్ అందించిన వివరాలు... అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలం సిరిగండపాడు గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ దుర్గా వెంకట రమణమూర్తి(45) ఈ నెల 12న గుంటూరులో పెన్నా సిమెంట్ కంపెనీ నుంచి లోడ్‌తో అనకాపల్లి జిల్లా మునగపాకకు బయలుదేరాడు. ఈ నెల 16న ముగనపాక చేరుకుని శ్రీభాగ్యలక్ష్మి సిమ్మెంట్ షాపులో అన్‌లోడు చేశాడు. అక్కడ నుంచి బయలు దేరి సబ్బవరం శివారు ఆదిరెడ్డిపాలెం సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద జాతీయ రహదారి ఫ్లై ఓవర్ కిందకు మంగళవారం రాత్రికి చేరుకుని అక్కడే లారీ నిలిపివేశాడు. సమీపంలోని దాబాలో భోజనం, టిఫిన్ చేసి బుధవారం మధ్యాహ్నం వరకూ ఫ్లై ఓవర్ సమీపంలో తిరిగాడు. మధ్యాహ్నం తర్వాత లారీ కేబిన్‌కు తాడు కట్టి ఉరిపోసుకున్నాడు. మృతుడి ఆధార్ కార్డు,మొబైల్ నెంబర్ ఆధారంగా లారీ యజమానికి సమాచారం అందించారు. స్థానిక వీఆర్వో శేషు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


లారీ కేబిన్‌కు ఉరిపోసుకున్న డ్రైవర్ దుర్గా వెంకట రమణమూర్తి

హుండీ ఆదాయం లెక్కింపు

అక్కిరెడ్డిపాలెం: బెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల వినాయక స్వామి, వేంకటేశ్వర స్వామి ఆలయంలో హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. జూలై 26 నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు 80 రోజులకు గాను రూ.1,06,046 ఆదాయం వచ్చినట్లు ఆలయ పరిపాలనా అధికారి ఎ.జగన్నాధరావు తెలిపారు. దేవదాయశాఖ పర్యవేక్షకుడు పి.ఎస్.ఎన్.మూర్తి, ఆలయ పాలక మండలి చైర్మన్ గంధ్రెడ్డి రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

బ్రెస్ట్ క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన

మద్దిలపాలెం: బ్రెస్ట్ క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన తప్పనిసరి అని కుశాల్ ప్రాజెక్ట్ మహిళా మండలి ప్రతినిధులు అన్నారు. జీవీఎంసీ 16వ వార్డులో ఇసుకతోట రజకవీధిలో బుధవారం అవగాహన కల్పించారు. రొమ్ము క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తిస్తే 90శాతం నయమవుతుందని తెలియజేశారు. రొమ్ము స్వీయ పరీక్ష పద్ధతులను వివరించారు. నెలలో ఒక సారి స్వీయ పరీక్షలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాసవ్య మహిళా మండలి ప్రతినిధుల బృందం భవాని, వరలక్ష్మి, పార్వతి, హేమలత తదితరులు పాల్గొన్నారు.


మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ బృందం

సెయిల్‌తో సమానంగా బోనస్ చెల్లించాలి

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో బుధవారం మహాధర్నా నిర్వహించారు. బుధవారం ఉదయం ఉక్కు బీసీ గేటుకు ఇరువైపులా కార్మికులు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. వైఎస్సార్ టీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప మాట్లాడుతూ సెయిల్‌తో సమానంగా బోనస్ చెల్లించాలని అలాగే గతేడాది ఇవ్వకుండా నిలిపివేసిన రూ.9500 ఈ బోనస్‌లో కలిపి చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, పిట్టా రెడ్డి, కర్రి దాలినాయుడు, ఎన్నేటి రమణ, నక్క వెంకటరమణ, అండిబోయిన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


బీసీ గేట్ వద్ద ధర్నా చేస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

ప్రైవేటీకరణ ఆపేవరకు ఉక్కు పోరాటం

కూర్మన్నపాలెం: స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని విరమిస్తున్నట్లుగా పార్లమెంట్‌లో ప్రకటించే వరకు ఉక్కు పోరాటం ఆగదని పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షల్లో 979వ రోజు, బుధవారం సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రస్తుత విశాఖ ఉక్కు యాజమాన్యం ప్రైవేటీకరణలో భాగంగా కేంద్రానికి సహకరిస్తూ ప్లాంట్‌ను నష్టాల్లో నడుపుతున్నారని ఆరోపించారు. ప్లాంట్ కష్టాల్లో ఉన్నప్పుడు కార్మిక వర్గం ఎంతో శ్రమించి ప్లాంట్‌ను దేశంలోనే నెంబర్ వన్ పరిశ్రమగా నిలిపారన్న సంగతి ప్రస్తుత యాజమాన్యం గుర్తుంచుకోవాలన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.


979వ రోజు దీక్ష శిబిరంలో పాల్గొన్న నాయకులు